# సాక్షి హనుమకొండ

గురువారం । 7 । సెప్టెంబర్ । 2023







**పథకాల కోసం పాట్లు..**

గృహలక్ష్మి, బీసీ బంధు పథకాలను లబ్ధిపొందడానికి దరఖాస్తుదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. - 8లో▸



**మేడారానికి రైలు మార్గం..**

మేడారానికి రైలు మార్గం రానుంది. భూపాలపల్లి-కాజీపేట మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మాణం ఫైనల్ లోకేషన్ సర్వేకు దక్షిణ మధ్య రైల్వే నిధులు కేటాయించింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం $29^0$ / $24^0$

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో జిల్లాలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### 11న కాజీపేట ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

**కాజీపేట:** కాజీపేట ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో ఈ నెల 11న మెగా అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అశోక్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, టర్నర్, వెల్డర్, స్టేనోగ్రఫీ తదితర ట్రేడ్‌లలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఉదయం 10 గంటల్లోగా హాజరు కావాలని కోరారు. ఎస్ఎస్‌సీ మెమో, ఐటీఐ మెమో, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో రావాలని సూచించారు.

### ముగిసిన ఉపాధ్యాయుల బదిలీల దరఖాస్తు ప్రక్రియ

కొత్తగా 128..

మొత్తంగా 1,453 మంది దరఖాస్తు

**విద్యారణ్యపురి:** టీచర్ల బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. కొత్తగా హనుమకొండ జిల్లాలో 128మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. కొన్నినెలల క్రితం ఈ ప్రక్రియ ప్రారంభంకాగా, 1,325మంది అన్ని కేటగిరీల టీచర్లు కలిపి దరఖాస్తు చేసుకున్నారు. కొత్తగా 128రాగా, మొత్తంగా 1453 దరఖాస్తులు వచ్చాయి. వచ్చినట్లయింది. పాత దరఖాస్తుదారులకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వగా 1,208మంది ఆన్‌లైన్‌లో ఎడిట్ చేసుకున్నారు. 117మంది ఎలాంటి ఎడిట్ చేసుకోలేదు. కొత్త దరఖాస్తుదారులు 128మంది ఉపాధ్యాయులు గురువారం హనుమకొండలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సర్వీస్ బుక్స్ వెరిఫికేషన్ చేయించుకోవాలని డీఈఓ అబ్దుల్‌హై కోరారు. దరఖాస్తుల ప్రతులు, ప్రిఫరెన్షియల్ కేటగిరీకి సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. కాగా, ధ్రువీకరణ పత్రాల పరిశీలన కమిటీతో బుధవారం డీఈఓ సమావేశమై పలు సూచనలు చేశారు.

### స్విమ్మింగ్‌పూల్‌లో 'స్వీప్'




**వరంగల్ స్పోర్ట్స్:** హనుమకొండ బాలసముద్రంలోని డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో బుధవారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటరు గుర్తింపుకార్డుకు దరఖాస్తు విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం క్రీడాకారులకు పతకాలతోపాటు నిర్వాహకులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఎ.శ్రీనివాస్‌కుమార్, స్వీప్ నోడల్ అధికారి ఎంహరిప్రసాద్, డీవైఎస్‌ఓ అశోక్, డీపీఓ జగదీశ్వర్, మెప్మా పీడీ భద్రునాయక్, ఏపీడీ శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, స్విమ్మింగ్ కోచ్ ఆర్.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

### ఆత్మహత్యల నివారణపై పోస్టర్ ఆవిష్కరణ



**హన్మకొండ అర్బన్:** 'గుడ్ ఫ్యూచర్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అండ్ సర్వీసెస్ సొసైటీ' ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఓ కార్యాలయంలో ఆత్మహత్యల నివారణపై అవగాహన ప్రచార పోస్టర్‌ను డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ ఆవిష్కరించారు. ఆత్మహత్యల నివారణ దినం సెప్టెంబర్ 10ని పురస్కరించుకుని ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఈశ్వర్, గాలి దయాకర్, కమల్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

### పాన్ ఇండియా కాన్ఫరెన్స్‌లో కేఎంసీ విద్యార్థుల ప్రతిభ



**ఎంజీఎం :** ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు గోవా మెడికల్ కాలేజీ బాంబోలియ్‌లో నిర్వహించిన జీఓ మెకాన్-2023 పాన్ ఇండియా మెడికల్ కాన్ఫరెన్స్‌లో కాకతీయ మెడికల్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పోస్టర్ ప్రదర్శనలో ఎండీ శశాంక్ మొదటి స్థానం సాధించగా, డిబేట్‌లో సింరాజు, శశాంక్‌లు ప్రథమ స్థానంలో నిలిచారు. ఉత్తమ వక్తగా రోహిత్ సంగరాజు ఎంపికైనట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ తెలిపారు. సదస్సులో విద్యార్థులు రూ.18 వేల నగదుతోపాటు మెరిట్ సర్టిఫికెట్లు పొందారని చెప్పారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

## తెలంగాణలోనే నిరంతర కరెంట్

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

**ఎల్కతుర్తి:** దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటలు కరెంట్ ఇస్తుంది కేవలం తెలంగాణ ప్రభుత్వమేనని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని జీల్గుల గ్రామంలోఎమ్మెల్యే సతీష్‌కుమార్‌తో కలిసి మైనార్టీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జగన్నాథ్‌పూర్‌లో ఆంజనేయస్వామిని దర్శించుకుని ఎన్నిక ప్రచారానికి శంఖారావం పూరించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పాలకులు ఇష్టానుసారంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతోపాటు నిరంతరం చార్జీలు పెంచేవారన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 24గంటల పాటు కరెంట్ సరఫరా అవుతోందన్నారు. తెలంగాణలో 25వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. మిషన్ కాకతీయ ద్వారా 44వేల చెరువులు, కుంటలు మరమ్మతులు చేశామన్నారు. ఫలితంగా చెరువుల్లో పుష్కలంగా నీరు నిలుస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్‌ను ఆదరించి హుస్నాబాద్ ఎమ్మెల్యేగా సతీష్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని చెప్పారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, ఎంపీపీ మేకల స్వప్న, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీష్‌కుమార్

## జిల్లాలో మోస్తరు వర్షం

మూడు రోజులనుంచి ఆకాశం మేఘావృతం

**హన్మకొండ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో హనుమకొండ జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. మూడు రోజుల నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. అప్పుడప్పుడు చిరు జల్లులు కురిశాయి. మరో మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం ఉదయం 8.30 నుంచి బుధవారం 8.30 వరకు జిల్లాలో సగటున 23 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా ఐనవోలులో 62.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఎల్కతుర్తిలో 36.4 మి.మీ, ధర్మసాగర్‌లో 33, వేలేరులో 23.6, నడికూడలో 23.6, కాజీపేటలో 23, ఆత్మకూర్‌లో 21.7, పరకాలలో 18.8 శాయంపేటలో 17.1, దామెరలో 16.1, భీమదేవరపల్లిలో 12.3, కమలాపూర్‌లో 11.2, హసన్‌పర్తిలో 11.7, హనుమకొండలో 11.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.



## శ్రీకృష్ణుడి అలంకరణలో భద్రకాళి అమ్మవారు

శ్రీకృష్ణజన్మాష్టమికి శ్రీభద్రకాళి అమ్మవారిని శ్రీకృష్ణుడిగా అలంకరించడం ప్రత్యేకత. బుధవారం సాయంత్రం ఆలయ అర్చకులు భద్రకాళి శేషు అధ్వర్యంలో అమ్మవారిని శ్రీకృష్ణుడిగా అలంకరించి విశేష పూజాధికాలు నిర్వహించారు. 21రకాల భోగములు నివేదించి భక్తులకు ప్రసాదాలుగా అందజేశారు. ఆలయ ఈఓ శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- హన్మకొండ కల్చరల్

## కర్నూలు-కర్ణాటక సరిహద్దులో.. చిక్కిన దొంగలు?

- వరంగల్ నగరంలో సంచలనం సృష్టించిన అపార్ట్‌మెంట్లలోని దొంగతనాలు..
- ఎనిమిది ఫ్లాట్లలో 120 తులాల బంగారం, నగదు అపహరించినట్లు నిర్ధారణ
- సీసీ ఫుటేజీలు, నెట్‌వర్క్‌తో ఆటకట్టించిన పోలీసులు
- ముఠా సభ్యులు మధ్యప్రదేశ్‌కు చెందిన వారుగా గుర్తింపు?



నిందితుల సీసీ ఫుటేజీ (ఫైల్)

**సాక్షిప్రతినిధి, వరంగల్:** వరంగల్ మహానగరంలో ఒకేరోజు ఆరు అపార్ట్‌మెంట్లలోని ఎనిమిది ఫ్లాట్లలో దొంగతనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా కర్నూలు - కర్ణాటక సరిహద్దులో బుధవారం ఉదయం పోలీసులకు చిక్కినట్లు సమాచారం. ఈ గ్యాంగ్ మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో 12 చోట్ల ప్రయత్నించి ఎనిమిది చోట్ల దొంగతనాలకు పాల్పడడంతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. హ్యుందయ్ ఐ 20 కారును ఉపయోగించిన ఈ దొంగల ముఠా.. ఇద్దరు కారులోనే ఉండగా.. మరో ఇద్దరు అపార్ట్‌మెంట్లలోకి చొరబడి తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు సీసీ ఫుటేజీల ద్వారా బయటపడింది. సుమారు 120 తులాల బంగారంతో పాటు భారీగా నగదు అపహరణకు గురైన ఈ ఘటనలపై వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ మూడు ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. క్రైమ్స్ డీసీపీ మురళీధర్ ఆధ్వర్యంలో మూడు బృందాలు సీసీ ఫుటేజీలు, కారు సమాచారం ఆధారంగా దొంగల కోసం గాలింపు చేపట్టారు.

**వరంగల్ టు కర్నూలు, వయా హైదరాబాద్...**

నగరంలో ఒకేరోజు వరుస దొంగతనాలకు పాల్పడిన తరువాత వచ్చిన కారులోనే వరంగల్ నుంచి బయలుదేరిన ఈ ముఠా బీబీనగర్ టోల్‌ప్లాజా దాటిన తర్వాత కొద్దిసేపు ఆగి బయలుదేరినట్లు తెలిసింది. వరంగల్, స్టేషన్‌ఘన్‌పూర్, బీబీనగర్, హైదరాబాద్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, జడ్చర్ల, భూత్పూరు, వనపర్తి, పెబ్బేరు, బీచుపల్లి, పుల్లూరుల మీదుగా కర్నూలుకు సుమారు 371 కిలోమీటర్లు.. 6.45 గంటల పాటు ప్రయాణించిన దొంగలు కర్నూలు - కర్ణాటక శివారులో పోలీసులకు చిక్కినట్లు సమాచారం. వీరు మధ్యప్రదేశ్‌కు రాష్ట్రానికి చెందిన వారుగా భావిస్తున్నారు. 2021లోనూ ఇదే గ్యాంగ్‌కు చెందిన సభ్యులు పలు దొంగతనాలకు పాల్పడినట్లు సమాచారం.

**సీసీ ఫుటేజీల ఆధారంగా..**

దొంగలకు సంబంధించిన సీసీ ఫుటేజీలను సీపీ రంగనాథ్.. హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, ఏపీ పోలీసులకు పంపించి సమాచారం ఇచ్చారు. దొంగతనాలకు పాల్పడిన తరువాత ముఠా ఎటు వెళ్లింది? అన్న కోణంలో విజయవాడ, కరీంనగర్, హైదరాబాద్ రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాలలో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. దీంతో ఎంపీ04-సీఎస్ 1816 నంబర్ గల హ్యుందయ్ ఐ-20 కారులో బీబీనగర్ టోల్‌ప్లాజా వరకు వెళ్లినట్లు గుర్తించిన పోలీసులు.. ఆ తర్వాత కూడా ట్రాక్ చేశారు. కర్నూలు మీదుగా కర్ణాటకకు వెళ్తున్న క్రమంలో సమాచారం అందుకున్న వరంగల్ పోలీసులు అక్కడి పోలీసులను అప్రమత్తం చేశారు. ఈ మేరకు కర్నూలు, కర్ణాటక పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో కారుతో పాటు నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్న నలుగురు దొంగల కోసం వరంగల్ నుంచి క్రైం విభాగం ఏసీపీతోపాటు ఓ బృందం బుధవారం కర్నూలుకు వెళ్లినట్లు సమాచారం.

**దొంగలు వాడిన కారు మధ్యప్రదేశ్‌దే..**

ఈ గ్యాంగ్ ఉపయోగించిన కారు మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌కు చెందినదిగా గుర్తించారు. దొంగతనం జరిగిన మరునిముషంనుంచి దొంగలు ఉత్తరప్రదేశ్ లేదా మధ్యప్రదేశ్ గ్యాంగ్‌గా అనుమానించిన పోలీసులకు కారు ద్వారా మరింత సమాచారం అందింది. ఎంపీ04-సీఎస్1816 నంబర్ గల కారు దమ్‌కెడ కోలార్ రోడ్, ఇంటి నంబర్ 49, మహాబలినగర్‌కు చెందిన అనిల్ థామస్ పేరిట 2014 సెప్టెంబర్ 19న భోపాల్ ఆర్టీఓ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించారు.

**తెలంగాణతోపాటు కర్ణాటక, ఏపీలలో దొంగతనాలు..**

వరంగల్ నగరంలో నిత్యం రద్దీగా ఉండే ప్రదేశాలను ఎంచుకుని ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇష్టమున్నట్లు చోరీలు చేస్తూ పోలీసులకే సవాల్ విసిరిన దొంగల ముఠా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లోనూ చోరీలకు పాల్పడినట్లు సమాచారం. తెలంగాణలోని హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో కూడా దొంగతనాలకు చేసినట్లు ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఇదే ముఠా 2021లోనూ వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు చెబుతున్నారు. ఇందులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒకరు ఉన్నట్లు సమాచారం. పోలీసులకు చిక్కిన నలుగురు సభ్యుల ముఠాలో ఒకరి పేరు మధ్యప్రదేశ్ మహాబలినగర్ దాంకేడకు చెందిన అనిల్ థామస్ అని తెలిసింది. సీసీ ఫుటేజీలు, ఇతర క్లూల ద్వారా సమాచారం సేకరించిన పోలీసులు ఎట్టకేలకు గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకోగా.. త్వరలోనే దొంగతనాల గుట్టురట్టు కానుంది. వరంగల్ సీపీ ఆదేశాల మేరకు క్రైం డీసీపీ మురళీధర్ ఆధ్వర్యంలో కేసు పరిశోధన సాగుతోంది.

## ఇళ్లలోనే చోరీలు అధికం

- కమిషనరేట్ పరిధిలో గతేడాదితో పోల్చితే పెరిగిన దొంగతనాలు
- 2022లో రూ.3,22,95,420 సొత్తు అపహరణ.. ఇప్పుడదీ రూ.3.65 కోట్లపైనే

**సాక్షి, వరంగల్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో దొంగలు పంజా విసురుతున్నారు. 2022లో రూ.3,22,95,420 సొత్తు అపహరణ కాగా.. ఇప్పుడది రూ.3.65 కోట్లపైనే ఉంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన వరుస దొంగతనాలతో సుమారు రూ.50 లక్షల సొత్తును ఎత్తుకెళ్లారు. ఆగస్టు వరకు ఉన్న రూ.3,15,66,339 సొత్తు విలువ, ఇప్పుడు ఆ రూ.50 లక్షలతో ఏకంగా రూ.3,65,66,339 వరకు పెరిగింది. మరిన్ని దొంగతనాలు జరిగితే ఈ ఏడాది రూ.నాలుగు కోట్లు మించినా ఆశ్చర్యపోనవసరం లేదు. మంగళవారం, బుధవారం దాదాపు 24 గంటల వ్యవధిలో మట్టెవాడ పరిధి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, హనుమకొండ, సుబేదారి పరిధిలో నాలుగు, మిల్స్ కాలనీ పరిధిలో మూడు ఇళ్లలో చోరీలు జరగడం పోలీసులకు సవాల్‌గా మారింది. నిందితుల ముఖాలు సీసీ టీవీ కెమెరాలకు చిక్కడంతో ఈ పని ఉత్తరప్రదేశ్ గ్యాంగ్ పని అయి ఉంటుందని నిర్ధారణకు వచ్చిన పోలీసులు ఆ దిశగా విచారణ వేగవంతం చేశారు. పోలీసులు మూలాల్లోకి వెళ్తేనే సొత్తు రికవరీ అయ్యే అవకాశముంది.

**వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో చోరీ, రికవరీ అయిన సొత్తు వివరాలు**

| సంవత్సరం | పోయిన సొత్తు (రూ.లలో) | రికవరీ (రూ.లలో) |
|---|---|---|
| 2021 | 2,99,61,302 | 1,22,01,375 |
| 2022 | 3,22,95,420 | 1,77,89,340 |
| 2023.. | | |
| జనవరి | 50,50,006 | 24,75,567 |
| ఫిబ్రవరి | 27,62,772 | 13,84,625 |
| మార్చి | 46,82,414 | 30,45,275 |
| ఏప్రిల్ | 36,88,430 | 18,81,200 |
| మే | 29,72,600 | 10,08,000 |
| జూన్ | 11,45,900 | 1,78,000 |
| జులై | 71,30,100 | 15,73,000 |
| ఆగస్టు | 41,34,117 | 1,00,900 |
| సెప్టెంబర్ | 50,00,000 | 0 |
| మొత్తం (2023 వరకు) | 3,65,66,339 | 1,16,46,567 |

## ఫార్మసిస్టుల సేవలు కీలకం

వరంగల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

**గీసుకొండ :** వైద్య, ఆరోగ్య శాఖలో ఫార్మసిస్టుల సేవల కీలకమైనవని, హెచ్‌డీఎఫ్ నిధులనుంచి ప్రతి ఏడాది రూ.15 వేల వరకు రవాణా ఖర్చులు ఇచ్చే విధంగా మెడికల్ ఆఫీసర్లను ఆదేశిస్తామని వరంగల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రభుత్వ ఫార్మసిస్టు అసోసియేషన్ వరంగల్, హనుమకొండ జిల్లాల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న ఫార్మసిస్టులకు రెమ్యునరేషన్ ఇస్తామన్నారు. ఫార్మసిస్టుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తిని సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంతోపాటు వైద్య, ఆరోగ్య శాఖలోని పలు విభాగాల్లో పనిచేస్తున్న ఫార్మసిస్టుల సర్వీసులను రెగ్యులర్ చేయాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు కందకట్ల శరత్‌బాబు, సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవంబట్ల ప్రకాశ్‌రావు, ప్రధాన కార్యదర్శి నార్ల వేణు, అవినాష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

## బేడ, బుడగ జంగాల అభివృద్ధికి కృషి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

**కమలాపూర్:** బేడ, బుడగ జంగాల కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. కమలాపూర్ మండలం ఉప్పల్‌లో బేడ, బుడగ జంగాల కులస్తులు బుధవారం పోచమ్మ బోనాలు నిర్వహించగా వేడుకల్లో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు స్వర్గం రవి.. బేడ, బుడగ జంగాల కమ్యూనిటీ హాల్ ఫ్లోరింగ్ కోసం రూ.5 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాయినేని తిరుపతిరావు.. బాలిక కడమంచి హారికకు రూ.లక్ష విలువైన ఫిక్స్‌డ్ బాండ్‌ను కౌశిక్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావు, ఎంపీటీసీలు ఎర్రబెల్లి సంపత్‌రావు, తూర్పాటి అరుణక్రాంతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎర్రం ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు, నాయకులు మారపెల్లి నవీన్‌కుమార్, లాండిగె లక్ష్మణ్‌రావు, పింగిలి ప్రదీప్‌రెడ్డి, తూర్పాటి ఉపేందర్, రాంబాబు, కుమార్, శివ, చెన్నమల్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డి

## వర్ధన్నపేటపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

కాంగ్రెస్ నేత కేఆర్ నాగరాజు

**ఐనవోలు:** మల్లన్న ఆశీర్వాదంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గంపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్న అభ్యర్థి కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ యువజన నాయకుల ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం నుంచి మల్లికార్జునస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మొదట సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నాగరాజు.. అనంతరం మల్లికార్జునస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిష్టానం తనకే టికెట్ కేటాయిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కుందూరు వెంకట్‌రెడ్డి, బొంపెల్లి దేవేందర్‌రావు, పిన్నింటి అనిల్‌రావు, అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మల్లికార్జునస్వామి ఆలయంలో కేఆర్ నాగరాజు


**యశోద హాస్పిటల్స్**

**యశోద మెడికల్ సెంటర్**

ఎస్‌బిఐ పక్కన, నక్కలగుట్ట, హన్మకొండ

సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

| ప్రత్యేకతలు | వైద్యులు | తేది - సమయం |
|---|---|---|
| హిమటాలజీ కన్సల్టేషన్: అసాధారణ మచ్చలు, గడ్డలు, మానని పుండ్లు, రొమ్ములో నొప్పిలేని కణుతులు, దగ్గినప్పుడు రక్తం రావడం, ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గడం / పెరగడం, బ్లడ్ క్యాన్సర్, లింఫోమా, రక్తహీనత, అన్ని రకాల రక్త సంబంధిత వ్యాధులు | డా॥ రాజేష్ బొల్లం, MBBS (Gold medalist), DNB (General Medicine), DM (Medical Oncology) (TMH), Medical & Hemato Oncologist, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ | 08-09-2023, 2వ శుక్రవారం, ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు |
| మెదడు, వెన్నెముక మరియు నరాల వ్యాధులు: మెదడులో గడ్డలు, రక్త స్రావం, చీము గడ్డలు, పక్షవాతం, తలకు గాయం, తల నొప్పి, పార్కిన్సన్, మరియు ఫిట్స్ వ్యాధులకు, డిస్క్ సమస్యలు, వెన్నుపాము గడ్డలు, ఫ్రాక్చర్ మరియు క్లిష్టమైన న్యూరో శస్త్రచికిత్సలు | డా॥ కె. ఎస్. కిరణ్, MS (Gen Surgery), M.Ch (Neurosurgery) (OSM), Ex-Assistant Professor, NIMS, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ | |
| ఊపిరితిత్తుల వ్యాధులకు కన్సల్టేషన్: బ్రాంకోస్కోపీ, ఎండోబ్రాంకియల్ బయాప్సీ, థొరకోస్కోపీ, దీర్ఘకాలిక దగ్గు, శ్వాసలో గురక, శ్వాస తీసుకోవటంలో కష్టం, ఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్, ఊపిరితిత్తుల క్యాన్సర్, టిబి (క్షయ), ఆస్తమా మరియు అలర్జీ | డా॥ వరుణ్ కుమార్ కందుకూరి, DTCD, DNB (Respiratory Medicine), కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ | |
| క్యాన్సర్ వ్యాధులకు కన్సల్టేషన్: మానని పుండ్లు, రొమ్ములో కణుతులు, గర్భసంచి క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, జీర్ణకోశ క్యాన్సర్, రెక్టమ్ క్యాన్సర్, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్ మరియు ప్రోస్టేట్ క్యాన్సర్ | డా॥ విజయ్ కుమార్ కొంతం, MBBS, DNB (Radiation Oncology), Ex. Tata Memorial Hospital, Mumbai | 09-09-2023, 2వ శనివారం, ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు |
| కార్డియో థొరాసిక్ సర్జరీ కన్సల్టేషన్: ఛాతిలో నొప్పి, ఊపిరి ఆడకపోవడం (ఆయాసం), గుండె త్వరగా కొట్టుకోవడం, శస్త్రచికిత్స తీసుకోవడంపై రెండవ అభిప్రాయం, ఎం.ఐ.సి.ఎస్., సర్జరీస్ ఫర్ హార్ట్ ఫెయిల్యూర్ | డా॥ గిరిధర్ హరిప్రసాద్, DNB (Gen. Surgery), MCh (CTVS), FRCS (C-Th), (Edinburgh), యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ | |
| క్యాన్సర్ వ్యాధులకు కన్సల్టేషన్: మానని పుండ్లు, రొమ్ములో కణుతులు, గర్భసంచి క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, జీర్ణకోశ క్యాన్సర్, రెక్టమ్ క్యాన్సర్, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్ మరియు ప్రోస్టేట్ క్యాన్సర్ | డా॥ మహేష్ బేజగం, MBBS, DNB (Radiation Oncology), Ex. Tata Memorial Hospital, Mumbai, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ | |
| వాస్కులర్ కన్సల్టేషన్: అన్ని రకముల రక్త నాళాల వ్యాధులు, కాళ్లలో నరాలు మెలి తిరిగి ఉబ్బుట, రక్త సరఫరా లోపంతో కాలివేళ్లు చెడిపోయి చర్మం నల్లగా మారడం, వెరికోజ్ వీన్స్ కోసం ఎండోవీనస్ అబ్లేషన్, కాలిలో షుగర్ వ్యాధి వల్ల వచ్చే మానని పుండ్లు | డా॥ డి. ప్రభాకర్, MS, M.Ch, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ | 12-09-2023, 2వ మంగళవారం, ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు |
| క్యాన్సర్ వ్యాధులకు కన్సల్టేషన్: మానని పుండ్లు, రొమ్ములో కణుతులు, గర్భసంచి క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, జీర్ణకోశ క్యాన్సర్, రెక్టమ్ క్యాన్సర్, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్ మరియు ప్రోస్టేట్ క్యాన్సర్ | డా॥ హేమంత్ ఉదయరాజు, MS (General Surgery), MCh (Surgical Oncology), DNB (Surgical Oncology), యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ | 13-09-2023, 2వ బుధవారం, ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు |
| మణికట్టు, చేతి & పునర్నిర్మాణ కన్సల్టేషన్: పుట్టుకతో వచ్చే చేతి వైపరీత్యాలు, రీప్లాంటేషన్ శస్త్రచికిత్స, పిల్లలు మరియు పెద్దలలో మెడ నుండి భుజము మీదుగా చేయికి పోరు నాడుల శస్త్రచికిత్సలు, చేతి పగుళ్లు, వేలు వైకల్యాలు | డా॥ మనీష్ కుమార్ జైన్, MS, DNB, D.Ortho, FNB (Hand & Microsurgery), యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ | |
| ఆర్థోపెడిక్ / కీళ్ళమార్పిడి కన్సల్టేషన్: మోకాళ్ళు, తుంటి, మోచేయి, కీళ్ళ మార్పిడి, మరియు ఎముకల సంబంధిత వ్యాధులు | డా॥ బ్రిజేష్ కిదియూర్, M.S (Ortho), A.O. Trauma, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ | 14-09-2023, 2వ గురువారం, ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు |
| కిడ్నీ వ్యాధులు: కిడ్నీ మార్పిడి అవసరం ఉన్న వాళ్ళు, డయాబెటిస్ వల్ల వచ్చే కిడ్నీ వ్యాధులు, మధుమేహం వ్యాధిగ్రస్తులలో మూత్రపిండాల సమస్యలు, క్రానిక్ & అక్యూట్ కిడ్నీ వ్యాధి సమస్యలు, హీమో డయాలసిస్ మరియు పెరిటోనియల్ డయాలసిస్ సమస్యలు | డా॥ వంశీకృష్ణ నాగళ్ల, MD (NIMS), DM (NIMS), యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ | |
| క్యాన్సర్ వ్యాధులకు కన్సల్టేషన్: ఊపిరితిత్తుల క్యాన్సర్, రొమ్ములో క్యాన్సర్, జెనిటో-యూరినరీ క్యాన్సర్లు, జీర్ణకోశ క్యాన్సర్, స్త్రీ జననేంద్రియ క్యాన్సర్, చిన్నపిల్లల్లో క్యాన్సర్ | డా॥ సందీప్ కుమార్ తుల, Consultant Oncologist, PGI Chandigarh, కన్సల్టెంట్ అంకాలజిస్ట్, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ | |

అపాయింట్‌మెంట్ కొరకు: 0870 - 2427777 | 2447778 | 2447779

## క్లుప్తంగా

### అప్పుల బాధ తాళలేక..

- కౌలు రైతు ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి


ఉపేందర్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : అప్పులు, ఆర్థిక సమస్యలతో మనోవేదనకు గురైన ఓ కౌలు రైతు.. ఆత్మహ్యతకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ మండలం నడివాడ గ్రామంలో జరిగింది. రూరల్ ఎస్సై బి.రాంచరణ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన పెదగాని ఉపేందర్ (40)కు 30 గుంటల సొంత వ్యవసాయ భూమి ఉండగా అందులో వరి సాగు చేశాడు. మరో నాలుగున్నర ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, మిర్చి పంటను సాగు చేశాడు. వ్యవసాయ పెట్టుబడికి అప్పులు, కుటుంబ పోషణ, పిల్లల చదువులకు రూ. 10 లక్షల వరకు అప్పు అయింది. ఈ అప్పు ఎలా తీర్చాలని మనోవేదనకు గురైన ఉపేందర్.. ఈనెల 4వ తేదీ రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం వెంటనే మానుకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని కుటుంబీకులకు అప్పగించిన్నట్లు ఎస్సై తెలిపారు.

### మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


కనుకయ్య (ఫైల్)

తరిగొప్పుల : మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని అక్కరాజుపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన మంచినీళ్ల కనుకయ్య(45), ఆయన భార్య కరుణకు మధ్య గొడవలు జరగడంతో 10 సంవత్సరాల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి కనుకయ్య కూతురు వైష్ణవి, కుమారుడు దేవరాజ్‌తో కలిసి గ్రామంలోనే ఉంటున్నాడు. జీవనోపాధి నిమిత్తం అప్పుడప్పుడు హైదరాబాద్ వెళ్లి వచ్చే వాడు. బోనాల పండుగ నిమిత్తం ఆదివారం హైదరాబాద్‌ను నుంచి గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో భార్య లేదని మనస్తాపం చెందిన ఆయన.. బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు.

### 'తానా' అంతర్జాతీయ కవి సమ్మేళనానికి చందర్



ఎల్కతుర్తి: ఈ నెల 9న కాళోజీ జయంతి పురస్కరించుకొని 'తానా' నిర్వహిస్తున్న అంతర్జాతీయ కవి సమ్మేళనానికి హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్‌కు చెందిన కవి, రచయిత పున్నం చందర్ నాగమల్లకు ఆహ్వానం అందింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘం, 'తానా' ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో 'తెలంగాణ భాషా దినోత్సవం' సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చందర్ నాగమల్ల తెలిపారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు
బ్రాయిలర్ చికెన్ రేటు
స్కిన్‌లెస్ చికెన్ రేటు
Cell: 9989299661

# పథకాల కోసం పాట్లు..

**ఎన్నికల వేళ గృహలక్ష్మి, బీసీ, మైనార్టీ బంధు**

- ఉమ్మడి వరంగల్‌లో దరఖాస్తుల వెల్లువ
- నాయకుల చుట్టూ దరఖాస్తుదారుల ప్రదక్షిణలు



సాక్షి ప్రతినిధి, వరంగల్: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ పథకాలు అర్హులను ఊరిస్తున్నాయి. దీంతో ఈ పథకాలలో లబ్ధిపొందడానికి వారు పడరాని పాట్లు పడుతున్నారు. అయితే అర్హులు ఎక్కువ సంఖ్యలో ఉండగా.. పథకాల యూనిట్ల సంఖ్య తక్కువగా ఉంది. ఫలితంగా దశల వారీ కేటాయింపు ప్రక్రియలో భాగంగా ఈసారి పరిమితంగానే ఇచ్చే అవకాశం ఉంది. దీంతో దరఖాస్తుదారులు ఈ విడతలోనే లబ్ధిపొందేందుకు ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రధానంగా గృహలక్ష్మి, బీసీ బంధు, మైనార్టీ బంధు పథకాలకు దరఖాస్తులు వేల సంఖ్యలో చేరాయి.

**జిల్లాల వారీగా, పథకాల వారీగా అందిన దరఖాస్తులు..**

| జిల్లా | గృహలక్ష్మి | బీసీ బంధు | మైనార్టీ బంధు |
|---|---|---|---|
| హనుమకొండ | 42,011 | 13,326 | 3,164 |
| వరంగల్ | 44,736 | 12,341 | 6,052 |
| జేఎస్ భూపాలపల్లి | 44,499 | 8,097 | 1,570 |
| ములుగు | 28,503 | 5,588 | 226 |
| జనగామ | 28,011 | 8,798 | 1,165 |
| మహబూబాబాద్ | 52,241 | 11,384 | 1,861 |
| | 2,40,001 | 59,534 | 14,038 |

**36 వేల మందికే గృహ'లక్ష్మి'.. 2.40 లక్షల దరఖాస్తులు...**

సొంత స్థలం ఉండి.. ఇల్లు లేని నిరుపేదల కోసం ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని చేపట్టింది. ఈ పథకంలో భాగంగా సొంత స్థలం ఉన్న వారికి అందులో ఇలు నిర్మించుకోవడానికి రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందిస్తుంది. నియోజకవర్గానికి 3 వేల మంది చొప్పున రుణం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఆగస్టు 10 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించగా.. ఉమ్మడి వరంగల్ నుంచి 2,40,001 మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా మహబూబాబాద్ నియోజకవర్గంలో 52,241 మంది దరఖాస్తు చేసుకోగా, జనగామ నుంచి 28,011 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ విడతలో నియోజకవర్గానికి 3వేల మందికి మంజూరు చేయనుండగా.. ఉమ్మడి జిల్లాల్లోని 12 నియోజవర్గాలకు చెందిన 36,000 మందికి ఆర్థిక సాయం అందజేయనున్నారు.ఈ నేపథ్యంలో ఈ ఎంపిక ప్రక్రియలో అధికారులతో పాటు ఆ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కీలకం కానున్నారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ద్వితీయ శ్రేణి నాయకుల సిఫార్సులతో పాటు అనుకూలురకు ఈ పథకం వర్తింపజేయనున్నారనే ప్రచారం సాగుతోంది. కాగా, ఆయా నియోజకవర్గాల్లోని గ్రామాలు, తండాలు, మున్సిపాలిటీల్లోని వార్డులు, డివిజన్ల నుంచి మూడు వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. దీంతో ఆ మూడు వేల మందిలో లబ్ధిదారులు ఎవరు అనే అంశంపై చర్చ జరుగుతుండగా.. గృహలక్ష్మి నిరంతర ప్రక్రియ అనే సీఎం కేసీఆర్ ప్రకటన ఊరట కలిగిస్తోంది.

**బీసీ, మైనార్టీ బంధులు... కొనసాగుతున్న పరిశీలన..**

దళితబంధు తరహాలో బీసీ బంధును అమలు చేస్తున్న సీఎం కేసీఆర్.. జూలై 23 మైనార్టీ బంధు పథకాన్ని ప్రకటించారు. దళితులకు రూ.10లక్షలతో దళితబంధు అమలు చేస్తుండగా, బీసీల్లోని చేతివృత్తులు చేపడుతున్న 15 కులాల ప్రజలకు రూ.లక్షతో బీసీ బంధును అమలు చేస్తున్నారు. ఈ పథకంలో భాగంగా ఆగస్టు మొదటి వారం నుంచి రూ.లక్ష సాయం అందిస్తున్నారు. ఈ పథకానికి ఉమ్మడి జిల్లా నుంచి 59,534 దరఖాస్తులు అందాయి. నిరంతరంగా దరఖాస్తులు, ఎంపిక, పంపిణీ ప్రక్రియ సాగుతున్నది. అలాగే మైనార్టీ బంధు పథకంలో భాగంగా వందశాతం సబ్సిడీతో రూ.లక్ష ఆర్థికసాయం అందించనున్నారు. ఇందుకోసం ఆగస్టు 14 వరకు దరఖాస్తులను స్వీకరించారు. ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల మందికి మొదటి విడతగా పంపిణీ చేసి ఆ తర్వాత కూడా పేద ముస్లిం, క్రిస్టియన్లకు ఈ పథకం ద్వారా ఆర్థికంగా చేయూత ఇవ్వనున్నారు. ఈ పథకం కింద ఉమ్మడి వరంగల్ నుంచి 14,038 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఈ పథకాలకు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తున్న ఆయా జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తున్నారని, ఇది నిరంతర ప్రక్రియని ఓ ఉన్నతాధికారి 'సాక్షి ప్రతినిధి'కి తెలిపారు.

**గ్రామంలో లేని వారికి రుణం**

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం అన్నాసాగరం గ్రామంలో ఒకే ఇంటిలో ముగ్గురు బీసీ పథకం కింద లబ్ధిపొందారు. అదే విధంగా మరో గ్రామంలో ఊరిలో లేని వారికి కూడా జాబితాలో చోటు కల్పించి చెక్కు ఇచ్చినట్లు స్థానిక ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. మండలంలో 350మందిని అర్హులుగా ఎంపిక చేయగా, తొలి విడతలో 61 లబ్ధిదారులను ఎంపిక చేసి చెక్కులు అందించారు. ఇందులో 30మంది వరకు అనర్హులున్నట్లు సమాచారం. ఇన్ని ఆరోపణలతో ఇప్పటికే ఈ మండలంలో చెక్కుల పంపిణీని నిలిపివేశారు.

# ఖేలో ఇండియా బోర్డు ఏర్పాటు చేయాలి

- సాట్ (ఇంజనీరింగ్) డీఈ దీపక్

వరంగల్ స్పోర్ట్స్ : హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో కేంద్ర ప్రభుత్వ (ఖేలో ఇండియా) నిధులతో నిర్మించిన సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌ను బుధవారం హైదరాబాద్ నుంచి వచ్చిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఇంజనీరింగ్ నిపుణులు పరిశీలించారు. సుమారు రెండున్నరేళ్ల క్రితం రూ. ఏడు కోట్లతో స్టేడియంలో అథ్లెటిక్స్ ట్రాక్‌తో పాటు క్రీడాకారులు దుస్తులు మార్చుకునేందుకు భవన నిర్మాణం, ఇతర వసతులు కల్పించారు. నాణ్యత, నిబంధనల మేరకు ట్రాక్, భవనం నిర్మాణం జరిగిందా అనే అంశాలను సాట్ డీఈ దీపక్ బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. సింథటిక్ ట్రాక్‌ను పూర్తిగా కలియతిరిగిన డీఈ దీపక్.. గచ్చిబౌలి స్టేడియంలో మాదిరిగా ట్రాక్ నిర్మాణం లేదని డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్‌ను అడగ్గా అంతకుమించి అధునాతన పద్ధతిలో నిర్మాణం జరిగిందని బదులిచ్చారు.


సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ను పరిశీలిస్తున్న దీపక్

**భవనంపై ఫ్లోరింగ్ చేయించాలి**

కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన ట్రాక్ ఎదుట బోర్డు ఏర్పాటు చేయాలని డీఈ దీపక్ సూచించారు. ఖేలో ఇండియా విడుదల చేసిన నిధులు, ట్రాక్ నిర్మాణ వివరాలు, అంచనా అందులో పొందుపరిచాలన్నారు. అనంతరం క్రీడాకారుల దుస్తులు మార్చుకునే భవనాన్ని పరిశీలించారు. భవనం పై వర్షపు నీరు నిలువడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఫ్లోరింగ్ చేయించాలని ఆదేశించారు. సాట్ డీఈ దీపక్ వెంట హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ అథ్లెటిక్ కోచ్ రతన్‌బోస్, తదితరులు ఉన్నారు.

# ఉద్యోగాల పేరిట మోసం

- వ్యక్తి అరెస్ట్..నకిలీ జాబ్ ఆర్డర్ కాపీలు, రూ. లక్ష నగదు, బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన పోలీసులు



ప్రశాంత్ అరెస్ట్‌ను చూపుతున్న పోలీసులు

ఎల్కతుర్తి: ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎల్కతుర్తి సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ వివరాలు వెల్లడించారు. మండలంలోని కేశవాపూర్ గ్రామానికి చెందిన ఈర ప్రశాంత్ కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ శాఖలు, కోర్టుల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని నమ్మించి వారి వద్ద డబ్బులు దండుకుని దొరకకుండా తిరుగుతున్నాడు. దీనిపై విసిగివేసారిన బాధితుడు దండేపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్ ఇటీవల స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ప్రశాంత్ కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం బావుపేట క్రాస్ వద్ద ద్విచక్ర వాహనంపై హనుమకొండకు వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా నేరం ఒప్పుకున్నాడు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ప్రశాంత్ కొన్ని సంవత్సరాల నుంచి కమలాపూర్, కాజీపేట, చిల్పూర్, మిల్స్ కాలనీ, హనుమకొండ ప్రాంతాల్లో అనేక మందికి జీఎంహెచ్( మిషన్‌హాస్పిటల్), ఎంజీఎం ఆస్పత్రుల్లో ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, ల్యాబ్‌టెక్నీషియన్, సెక్యూరిటీ గార్డ్స్, కంప్యూటర్ ఆపరేటర్, గురుకుల హాస్టల్లో సూపర్ వైజర్, నర్సింగ్, కోర్టుల్లో అటెండర్, రికార్డు అసిస్టెంట్ ఉద్యోగాలు ఉన్నాయని మాయమాటలు చెప్పారు. ఆ ఉద్యోగాలు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఇప్పిస్తానని నమ్మించి వారి నుంచి డబ్బులు దండుకున్నాడు. అనంతరం నకిలీ ఆర్డర్ కాపీలు సృష్టించి వారికి ఇచ్చాడు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితుల్లో ఒకరైన సాయికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రశాంత్‌ను అరెస్ట్ చేసి నకిలీ జాబ్‌కార్డు కాపీలు, రూ. లక్ష నగదు, ద్విచక్రవాహనం, నకిలీ స్టాంప్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ అంకిత్ శంక్వార్, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై రాజ్‌కుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఒకే రోజు మూడు ఇళ్లలో చోరీలు..

- బంగారం, వెండి ఆభరణాలు, నగదు అపహరణ
- పుప్పాలగుట్టలో ఘటన.. భయాందోళనలో స్థానికులు


దొంగలు చోరీకి పాల్పడిన రాజారావు ఇల్లు ఇదే..

ఖిలా వరంగల్ : మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే రోజు తాళం వేసిన మూడు ఇళ్లలో చోరీ జరిగింది. ఈ ఘటన పుప్పాగుట్ట ముత్యాలమ్మ గుడి సమీప కాలనీలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం హమీద్, సహనాజ్ దంపతులు కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ముగ్గురు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. హమీద్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తుండగా సహనాజ్ ఒక్కరే ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. బుధవారం ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికే తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లో విలువైన వస్తువులు ఏమీలేకపోవడంతో ఊపిరిపీల్చుకుంది. అలాగే, అదే కాలనీకి చెందిన మేడ మేనయ్య, స్వర్ణలత దంపతులు ఇంటికి తాళం వేసి ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. దుండగులు తాళం ధ్వంసం చేసి ఇంట్లోకి ప్రవేశించారు. ఏ వస్తువులు లభించకపోవడంతో వెనుదిరిగారు. అలాగే, అదేకాలనీకి చెందిన రైల్వే రిటైర్డ్ ఉద్యోగి సలికినేని రాజారావు, సంపూర్ణ దంపతులు తమ ఇంటికి తాళం వేసి సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఉంటున్న కుమార్తె ఇంటికి వెళ్లారు. బుధవారం తెల్లవారు జామున బంధువుల ద్వారా ఇంట్లో చోరీ జరిగిన విషయం తెలిసి వరంగల్‌కు చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లి చూడగా సామగ్రి చిందరవందరగా పడి ఉంది. బీరువా తెరిచి చూడగా అందులో దాచిన రెండున్నతులాల బంగారం, పదహారు తులాల వెండి, రూ. వేయి నగదు కనిపించలేదు. దీంతో బాధితులు లబోదిబోమన్నారు. దీనిపై సమాచారం అందుకున్న మిల్స్‌కాలనీ సీఐ సురేష్ , ఎస్సై శ్రీలత, క్లూస్ టీమ్ హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. తాళం వేసిన మూడు ఇళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేష్ తెలిపారు.

### కారు ఢీకొని చేపల వ్యాపారి దుర్మరణం


ఘటనా స్థలిలో బిచ్చా మృతదేహం

కురవి: కారు ఢీకొని చేపల ఓ వ్యాపారి దుర్మరణం చెందాడు. ఈ ఘటన కురవి శివారులోని పెట్రోల్ బంక్ వద్ద 365 జాతీయ రహదారిపై జరిగింది. ఎస్సై బి.గోపి కథనం ప్రకారం బయ్యారం మండలం కొత్తపేట శివారు హేమ్లానాయక్ తండాకు చెందిన బానోత్ బిచ్చా(48) చేపల వ్యాపారం చేస్తుంటాడు. ఊరూర తిరుగుతూ చేపలు విక్రయిస్తాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం కొత్తపేట నుంచి ద్విచక్రవాహనంపై కురవి మీదుగా పాలేరుకు వెళ్లి చేపలు తీసుకొస్తున్నాడు. కురవి శివారులోని పెట్రోల్ బంక్ వద్ద మరిపెడ వైపు నుంచి వస్తున్న కారు..ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో బిచ్చా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా, డ్రైవర్ వినయ్ నిద్రమత్తులోనే ఈ ఘటన జరిగిందని స్థానికులు పేర్కొన్నారు.

### ఈస్‌కోస్ట్ రైలులో పొగలు

- ఆందోళనకు గురైన ప్రయాణికులు

డోర్నకల్: మహబూబాబాద్–గుండ్రాతిమడుగు రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం ఈస్ట్‌కోస్టు రైలులో పొగలు రావడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సికింద్రాబాద్‌నుంచి షాలిమార్‌కు వెళ్తున్న ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మహబూబాబాద్ స్టేషన్ దాటి గుండ్రాతిమడుగు సమీపిస్తుండగా రైలులోని ఓ బోగీ నుంచి పొగలు రావడంతో లోకోపైలట్ రైలును నిలిపివేశాడు. రైలు చివరి బోగీ చక్రాలకు బ్రేకులు అతుక్కోవడంతో పొగలు వచ్చినట్లు గుర్తించి డ్రైవరు, గార్డు మరమ్మతులు చేశారు. కాగా, ఆందోళనకు గురైన ప్రయాణికులు రైలు దిగి పట్టాలకు దూరంగా వెళ్లి నిల్చున్నారు. సుమారు 25 నిమిషాల అనంతరం రైలు డోర్నకల్ స్టేషన్‌కు చేరుకోగా సీఅండ్‌డబ్ల్యూ సిబ్బంది చివరి బోగీ(జనరల్ బోగి) కింద చక్రాల బ్రేకులకు పూర్తిస్థాయి మరమ్మతులు చేసిన అనంతరం రైలును కదిలించారు.


బోగీల నుంచి వస్తున్న పొగలు

**మహబూబాబాద్‌లో చైన్ పుల్లింగ్...**

అంతకుముందు ఈస్ట్ కోస్టు రైలు మహబూబాబాద్ స్టేషన్‌కు చేరుకున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి చైను లాగడంతో రైలు ఆగినట్లు సమాచారం. అక్కడి సిబ్బంది బ్రేక్‌లు రిలీజ్ చేయగా రైలు కదలడంతో బ్రేకులు చక్రాలను పూర్తిగా వీడకపోవడంతో గుండ్రాతిమడుగు సమీపంలోకి వెళ్లగానే రైలు చివరి బోగీ నుంచి పొగలు వచ్చినట్లు తెలిసింది. పొగలు వస్తున్న విషయం గమనించిన గేట్‌మెన్ ఎర్ర జెండా చూపి అప్రమత్తం చేయడంతో సిబ్బంది రైలును ఆపి మరమ్మతులు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

**REAL ESTATE**

**OPEN PLOTS FOR SALE**

యాదాద్రి, ఆలేరు, హన్మకొండ, వరంగల్ ఓపెన్ ప్లాట్స్ 100 గజాల నుండి 500 గజాల వరకు అమ్మబడును. కొనబడును. సెల్ నెం: 9849944629. [W-1229408]

**LAND FOR SALE**

Thorrur Highway Facing 1.16 Acres Chinnavangara, 1.05 Cr. Neg. Direct Owner, Contact: 8978189434. [HA-94918]

**WANTED**

Daddysroad Company లో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం: 15000 నుండి 20000. సెల్: 9959120760, 9848785232. [W-1229412]

వరంగల్‌లో వాషింగ్ మిషన్ రిపేర్ చేయడానికి Boys కావలెను. కొత్త వారు /అనుభవం అవసరం లేదు. (బైక్ తప్పనిసరి+ పెట్రోల్ అలవెన్స్+ మంచి జీతం ఇవ్వబడును) సంప్ర॥ 8179585395. [W-1229354]

SSS గ్రామెంట్ నందు రెడిమేడ్ షర్ట్స్ NGO's కాలనీలో కుట్టుటకు లేడీస్ వర్కర్స్ & హెల్పర్స్ కావలెను. ఎవరైనా 10 మంది గ్రూప్ ఉంటే రూం ఇవ్వబడును. వ॥18 to 30 సం॥లోపు. 8686309898, 7993660898. [W-189165]

GNM నర్సులు, Dialysis టెక్నీషియన్స్ & OT టెక్నీషియన్స్ కావలెను. Contact: GUARDIAN HOSPITAL, Mulugu 'X' Road, Warangal. Time: 12 to 2pm. [WA-973]

ప్రముఖ కంపెనీ యొక్క రికార్డ్స్ వ్రాసినందుకు వారం వారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. ఫోన్: 7730899503 [G-1113]

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573833520, 9059633520. [M-1221536]

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులు, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్ : 9640468899, 9640258899 [H-189329]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

### విద్యుత్‌పై అప్రమత్తంగా ఉండాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: మరో ఐదు రోజులు భారీ వర్షాలు కురువనున్న నేపథ్యంలో ప్రజలు విద్యుత్‌పై అప్రమత్తంగా ఉండాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు అన్నారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు భద్రతా సూత్రాలు పాటించాలని బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. తడి చేతులతో విద్యుత్ పరికరాలు, స్తంభాలు, తీగలను ముట్టుకోవద్దన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలు, ఫిర్యాదుల గురించి 1800 425 0028, 1912 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

### 'ఉన్నతి' ఉపాధ్యాయులకు ఉపయోగం

కాశిబుగ్గ: 'ఉన్నతి' శిక్షణ ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగపడుతుందని అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.సారయ్య అన్నారు. అబ్బనికుంటలోని ప్లాటినం జూబ్లీ పాఠశాలలో వరంగల్ డివిజన్‌లోని ఆరు మండలాల ఆంగ్ల ఉపాధ్యాయులకు మూడు రోజుల నుంచి జరుగుతున్న 'ఉన్నతి' శిక్షణ బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'ఉన్నతి' శిక్షణలో నేర్చుకున్న కొత్త విషయాలను ఉపాధ్యాయులు.. విద్యార్థులకు అందించి వారిని మరింత విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ కె.వెంకటయ్య, ఆర్పీలు ఎం.వెంకటేశ్వర్లు, పూల శ్రీనివాస్, లక్ష్మణ్, అనుపమ, ఎల్టా రాష్ట్ర అధ్యక్షుడు టీవీ.రావు పాల్గొన్నారు.

# మేడారానికి రైలు మార్గం..

- భూపాలపల్లి–కాజీపేట కొత్త రైల్వే లైన్ సర్వేకు గ్రీన్ సిగ్నల్
- ప్రాజెక్ట్ మొత్తం సుమారు రూ.1,152 కోట్లతో 64 కి.మీ.
- కరీంనగర్–హసన్‌పర్తి కొత్త లైన్ సర్వేకు గ్రీన్‌సిగ్నల్
- ప్రాజెక్ట్ మొత్తం సుమారు 1,116 కోట్లతో 62 కి.మీ.

కాజీపేట రూరల్: ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారానికి రైలు మార్గం రానుంది. కాజీపేట సబ్ డివిజన్ కేంద్రంగా భూపాలపల్లి–కాజీపేట (హసన్‌పర్తి) మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మాణం ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్.ఎల్.ఎస్.)కు రూ.1,152 కోట్లు మంజూరు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేష్ బుధవారం తెలిపారు. రైల్వే మంత్రిత్వ శాఖ రైళ్ల అనుసంధానం బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టి సారించి భూపాలపల్లి–కాజీపేట మధ్య దాదాపు 64 కి.మీ. విస్తరించే అవకాశం ఉందని తెలిపారు. ఈ లైన్ నిర్మాణ అంచనా వ్యయం దాదాపు రూ.1,152 కోట్లు. ఈ లైన్ గిరిజన జిల్లాల హెడ్‌క్వార్టర్ భూపాలపల్లిని జగదల్‌పేట, మరిపల్లి మీదుగా ప్రధాన ట్రంక్ మార్గంతో కలుపుతూ గిరిజనుల ఆరాధ్య దైవాలైన సమ్మక్క, సారక్క కొలువైన మేడారాన్ని కూడా కలుపుతుంది. ఈ కొత్త రైల్వేలైన్ రైలు కనెక్టివిటీతో మొదటిసారి అనేక కొత్త ప్రదేశాలను అనుసంధానించడమే కాకుండా కొత్త రైల్వే లైన్ ఈ ప్రాంత సామాజిక ,ఆర్థిక, అభివృద్ధికి ఉపయోగపడుతుంది. వ్యవసాయం, వ్యాపారం, విద్య, పర్యాటకం, ఆరోగ్య సంరక్షణ, తదితర బహుళ రంగాలలో అభివృద్ధితో పాటు రాష్ట్ర రాజధాని నుంచి మేడారం జాతరకు ప్రయాణికుల రాకపోకలకు దోహదపడుతుంది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బొగ్గు గనులు, ఇసుక, ఖనిజాలు, లాటరైట్, డోలమైట్, బొగ్గు, మట్టి, నల్ల గ్రానైట్ , సున్నపురాయి రవాణకు రైలు మార్గం దోహదపడుతుంది.



**కరీంనగర్–హసన్‌పర్తి కొత్త లైన్ సర్వే మంజూరు**

కరీంనగర్–హసన్‌పర్తి మధ్య కొత్త రైల్వే లైన్ ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్.ఎల్.ఎస్.)కు రైల్వే శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మార్గం దాదాపు 62 కి.మీ. విస్తరించే అవకాశం ఉంది. దీని నిర్మాణ వ్యయం సుమారు రూ.1,116 కోట్లు. ఈ రైలు మార్గం మానకొండూర్, హుజూరాబాద్ పట్టణాలను హైదరాబాద్‌తో కలపడంతో పాటు విజయవాడ, చెన్నై, తిరుపతి, వైపు ప్రత్యక్ష అనుసంధాన్ని సులభతరం చేస్తుంది. ఈ లైన్ కాజీపేట–పెద్దపల్లి మధ్య ప్రస్తుత ప్రధాన లైన్‌కు ప్రత్యామ్నాయ మార్గంగా పని చేస్తుంది. ఈ రైలు కనెక్టివిటి..ఈ ప్రాంతాల ప్రయాణికులు, సామాజిక, ఆర్థిక, పర్యాటక, సంపద, రవాణకు ఎంతో దోహదపడుతుంది.

# నిట్‌లో ఉత్సాహంగా ఇండక్షన్


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ గజేంద్రనాథ్

- బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు క్యాంపస్, తదితర అంశాలపై అవగాహన
- 9వ తేదీ వరకు రోజువారీగా సదస్సులు

కాజీపేట అర్బన్: వరంగల్‌లోని నిట్‌లో బీటెక్ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశాలు పొందిన నూతన విద్యార్థులకు నిట్ క్యాంపస్‌ను పరిచయం చేసేందుకు యాజమాన్యం నిర్వహిస్తున్న ఇండక్షన్ ప్రోగ్రాం ఉత్సాహంగా సాగుతోంది. ఈ నెల 4న బీటెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులు, తల్లిదండ్రులకు ఓరియెంటేషన్ ప్రోగ్రాంను నిర్వహించి నిట్‌ను డైరెక్టర్ బిద్యాధర్‌సుబుదీ పరిచయం చేసి స్వాగతం పలికారు. 9వ తేదీ వరకు ఇండక్షన్ ప్రోగ్రాం పేరిట నిట్‌లోని తరగతి గదులు, ల్యాబ్స్, వర్క్‌షాప్స్, వివిధ డిపార్ట్‌మెంట్లు, ఆడిటోరియం, కాన్ఫరెన్స్ హాల్స్‌ను పరిచయం చేస్తూనే ప్రతిరోజూ ఆర్ట్ ఆఫ్ మైండ్, ఆర్ట్ ఆఫ్ స్మార్ట్ వర్క్, ఒత్తిడిని జయించేందుకు, యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్‌పై నిట్ అధ్యాపకులతో పాటు నిష్ణాతులచే రోజు వారీగా సదస్సులను నిర్వహిస్తున్నారు.

**క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలక్ట్ అవుతా..**



నిట్ క్యాంపస్‌లో సీటు రావడం అంటే క్యాంపస్ సెలక్షన్స్‌లో జాబ్ కొట్టినట్టే. నిజంగా క్యాంపస్‌లోకి ఎంటర్ కాగానే సెలక్షన్స్‌లో సెలక్ట్ అవుతాననే నమ్మకం కలిగింది. లక్ష్య సాధనకు ఇష్టపడి చదువుతాను. ఇండక్షన్ ప్రోగ్రాంతో ప్రొఫెసర్లతో పాటు తోటి విద్యార్థులతో కలిసే అవకాశం లభించింది.

– గుల్షన్ లిఖర్, కెమికల్, రాయ్‌పూర్

**నిట్‌లో చేరాలనే లక్ష్యం నెరవేరింది..**



నేను హైదరాబద్‌లో పుట్టి పెరిగినా కూడా నాకు నిట్ వరంగల్‌లో చేరాలనేదే నా లక్ష్యం ఇందుకు గాను ఇష్టపడి చదివి మంచి ర్యాంకుతో నిట్‌లో చేరాను. సివిల్ రంగంలో నూతన ఆవిష్కరణలు చేపట్టి సామాన్యులకు ,సమాజానికి తోడ్పడాలనే లక్ష్యంతో రీసెర్చ్‌లు చేస్తాను.

– తనుశ్రీ, సివిల్, హైదరాబాద్

**క్యాంపస్ బాగుంది..**



నిట్ క్యాంపస్ అంతా గ్రీన్‌గా, క్లాసెస్, అత్యాధునిక ల్యాబ్స్‌తో చాలా బాగుంది. నిట్‌లో సీటు రావడం ఎంతో ఆనందంగా ఉంది. పూనే నుంచి భయపడుతూ వచ్చాను. ప్రొఫెసర్ల కమ్యూనికేషన్స్‌తో నా భయం పోయింది. నా తల్లిదండ్రులు, నా ఆశయాలను సాకారం చేసుకునేందుకు కష్టపడుతాను.

– వసీఖలీ రఫీక్ రంగరాజ్, కెమికల్, పూనే

**ల్యాబ్స్ బాగున్నాయి..**



క్యాంపస్‌లోని ల్యాబ్స్ అడ్వాన్స్ టెక్నాలజీతో రీసెర్చ్‌లకు అనుగుణంగా చాలా బాగున్నాయి. మెకానికల్ విభాగంలో సీటు సాధించిన నేను నూతన ఆవిష్కరణలకు రీసెర్చ్‌లకు ల్యాబ్స్ ఎంతో అనుకూలంగా ఉన్నాయి.

– నితేష్, మెకానికల్, వెస్ట్‌బెంగాల్

**గవర్నమెంట్ జాబ్ కొడతా..**



నిట్ క్యాంపస్‌లో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో సీటు సాధించాను. సివిల్ ఇంజనీరింగ్‌లో రాణించి, గవర్నమెంట్ జాబ్ కొట్టాలనే నా లక్ష్యానికి నిట్ క్యాంపస్ తోడ్పడుతుందని అనుకుంటున్నాను. డైరెక్టర్, ప్రొఫెసర్లు క్యాంపస్ సెలక్షన్స్ తో పాటు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించేందుకు ఇండక్షన్ ప్రోగ్రాంలోనే మెళకువలను తెలియపరుస్తున్నారు.

– ఆకాంక్ష, సివిల్, ఏపీ